సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

మార్కెట్లకు శ్రావణ శోభ

భారీగా వరలక్ష్మీ వ్రత పూజా సామగ్రి కొనుగోళ్లు



గోపాలపట్నం రైల్వే స్టేషన్ రోడ్డులో దుకాణాల వద్ద రద్దీ





కంచరపాలెంలో పండ్లు, పువ్వులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కంచరపాలెం: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని గురువారం మార్కెట్లు, రైతుబజార్లు వినియోగదారులతో సందడిగా మారాయి. కంచరపాలెంలో కొబ్బరికాయలు, అరటి పండ్లు, పూలు, ఇతర పూజా సామాగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. కంచరపాలెం రైతు బజారులో మహిళా వినియోగదారులు బారులు తీరారు. బయట మార్కెట్‌లో ధరలు కాస్తా ఎక్కువగా ఉండటంతో రైతుబజారులో కొనుగోలు చేశారు. చామంతి పూలకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో ధరలు పెంచి విక్రయించారు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. కంచరపాలెం వై జంక్షన్ నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారి వినియోగదారులతో నిండిపోయింది. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో సిబ్బంది వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

కిటకిటలాడిన దుకాణాలు

గోపాలపట్నం: గోపాలపట్నం, బాజి జంక్షన్ ప్రాంతాల్లోని రహదారులు వరలక్ష్మీ వ్రత పూజా సామగ్రి కొనుగోళ్లతో బిజీబిజీగా మారాయి. అధిక సంఖ్యలో మహిళలు పూజా సామగ్రి, వస్త్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. గురువారం సాయంత్రం నుంచి గోపాలపట్నం రైల్వే స్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి జనంతో రద్దీగా మారింది.

మల్కాపురం: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. మల్కాపురం, శ్రీహరిపురం మార్కెట్ల వద్ద రద్దీ నెలకొంది.



మల్కాపురం మార్కెట్ వద్ద సందడి

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ నాగభూషణం

సింధియా: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వార్డులోని ఏకేసీ కాలనీ సచివాలయంలో గురువారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే అంశంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి 40, 61, 62, 63 వార్డుల జేసీఎస్ కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన మాట ప్రకారం జేసీఎస్ క్యాడర్‌లోని ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, మహిళా సాధికారత, విద్య, వైద్యం కోసం జగనన్న ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. పాలనా సౌలభ్యం కోసం 15 వేలకు పైగా సచివాలయాలు, 17 వేల రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఎవరెంత చేసినా రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌కే ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్లపై తప్పుడు ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు గుండపు అశోక్, దండి శ్యామ్, పెంట్ల బాలకృష్ణ, మీసాల సత్యనారాయణ, శరగడం గంగరాజు, వార్డు అధ్యక్షులు వరపల మహేష్, గంటా వర్మ, గృహసారథులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడండి



సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సూచనలిస్తున్న జేసీఎస్ కన్వీనర్ కన్నబాబు

మల్కాపురం: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని మాజీ కార్పొరేటర్, 58, 59, 60 వార్డుల జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు అన్నారు. ఈ విషయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 58వ వార్డు 323, 324, 328 సచివాలయాల పరిధి గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో గురువారం స్థానిక సామాజిక భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని, సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ కోసం శ్రమించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

స్పీకర్ తమ్మినేనికి ఘన స్వాగతం



విమానాశ్రయంలో స్పీకర్ సీతారాంకు స్వాగతం పలుకుతున్న కమిషన్ సభ్యులు

గోపాలపట్నం: అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు విశాఖ విమానాశ్రయంలో గురువారం ఘన స్వాగతం లభించింది. రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో జరిగిన కామన్ వెల్త్ అసోసియేషన్ సమావేశాల్లో పాల్గొని, విశాఖ తిరిగి వచ్చిన ఆయన్ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఉదయ్‌పూర్‌లో జరిగిన సదస్సులో దేశ, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ఎన్నో కీలక అంశాలు చర్చకు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ జిల్లా కన్వీనర్ ఎల్లయ్య, అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ డాక్టర్ బాకా లవకుశ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ



నరవలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం జాతి గర్వించదగినదని బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ బెహర విజయ చైతన్య అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో గురువారం బెహరా విద్యా సంస్థల విద్యార్థులు జాతీయ జెండా, చంద్రయాన్ నమూనా కార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో సాధించిన ఈ విజయం నుంచి విద్యార్థులు చాలా విషయాలు నేర్చుకోవాలని సూచించారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి యావత్ భారతావని కృతజ్ఞతాభినందనలు చెబుతోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్, ప్రిన్సిపాల్ సుకన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడి అరెస్ట్

మద్రిపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడిని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్‌కు చెందిన దిలీప్‌కుమార్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన పి.వందన అనే యువతిని ప్రేమించాడు. పెళ్లి కూడా చేసుకుంటానన్నాడు. వారి ప్రేమను యువతి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. యువకుడి తల్లిదండ్రులు మాత్రం ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో దిలీప్‌కుమార్ పెళ్లికి నిరాకరించడంతో వందన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో కేసు నమోదు చేశారు. సదరు యువకుడిని గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మద్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎన్ఏడీ ప్రాంతంలో నివసిస్తున్న బాదిరెడ్డి శివ వరప్రసాద్ అనే యువకుడు మధురవాడలోని ఓ కాలేజీలో ఎంబీఏ చదువుతున్నాడు. బుధవారం కళాశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలో సుమారు మధ్యాహ్నం 3.30 గంటలకు కప్పరాడ వద్దకు వచ్చేసరికి తన ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా నిలిపివేయడంతో బైకుపై వస్తున్న యువకుడు దాన్ని ఢీకొన్నాడు. దీంతో అతడి కుడి చేతికి గాయమైంది. క్షతగాత్రుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కంచరపాలెం పోలీసులు శివ వరప్రసాద్ వద్ద వివరాలు సేకరించారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్ రెడ్డి గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

- పోలీసులకు డీసీపీ నాగన్న ఆదేశం
- గోపాలపట్నం క్రైం స్టేషన్ తనిఖీ



గోపాలపట్నం క్రైం స్టేషన్లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ నాగన్న

గోపాలపట్నం: పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని విశాఖ డీసీపీ జి.నాగన్న సిబ్బందిని ఆదేశించారు. గోపాలపట్నం క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాలు అత్యధికంగా జరిగే ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, జీడీ ఎంట్రీ, తదితర రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సస్పెక్టెడ్ నేరస్తులకు ప్రతీ ఆదివారం కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాల ఆవశ్యకత, ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఫిర్యాదులు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. గోపాలపట్నం ఎస్ఐ సూర నర్సింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీల ట్రోఫీల ఆవిష్కరణ



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: కల్చర్ ఫౌండేషన్, ట్రిస్, రైస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ పోటీల ట్రోఫీలు, పోస్టర్లను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 29 వరకు గాజువాక హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ పోటీలకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. క్రీడాభిమానులు, క్రీడాకారులు ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టుల ప్రతినిధులు, నిర్వాహకులు దాస్, పేర్ల అప్పారావు, శేఖర్, శివ, తాతారావు, గిరిధర్ నాయుడు, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలకం

- చంద్రయాన్-3లోనూ భాగస్వామ్యం
- అందుకే అంత తక్కువ వ్యయంతో విజయం
- అటువంటి సంస్థల నిర్వీర్యం సరికాదు
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

కూర్మన్నపాలెం: దేశ ప్రగతిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలక భాగస్వామ్యం పోషిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇస్రో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-3లోను ప్రభుత్వరంగ సంస్థల భాగస్వామ్యం ఉందని, అందుకే తక్కువ వ్యయంతో ఇంతటి విజయం సాధ్యమైందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం 924వ రోజు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకోవడం సరికాదన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి పేద, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారని, కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చెత్త తరలింపులో సమయపాలన ముఖ్యం



రైల్వేస్టేషన్ ప్రాంతంలో క్లాప్ వాహనాలను పరిశీలిస్తున్న జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలి, రైల్వేస్టేషన్ రోడ్డు, భారతీయ ఆహార గిడ్డంగి రహదారి, జ్ఞానాపురం రైల్వేస్టేషన్, బీఆర్‌టీఎస్ రహదారుల్లో చెత్త తరలించే క్లాప్ వాహనాలను గురువారం జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి చెత్త తరలింపు ప్రక్రియలో సమయ పాలన పాటించాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. పలు వీధుల్లో పర్యటించి తడిపొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు ఫ్రైడే-డ్రైడే పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్ఎస్ఎం ప్రసాద్, సూపర్‌వైజర్ అర్జున్, సచివాలయ శానటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సమావేశం రేపు

అగనంపూడి: పీఆర్‌టీయూ పరవాడ మండల కమిటీ సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్. పెద్దినాయుడు తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయిలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించడంతో పాటు మండల కొత్త కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ పాల్గొంటారని తెలిపారు.

'ఉక్కు' అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు ఎనలేనివి



క్యూఏటీడీ ఉద్యోగి సత్యారావుకు జ్ఞాపిక అందజేస్తున్న విభాగం జీఎం రుచిరా గుప్తా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు ఎనలేనివని స్టీల్‌ప్లాంట్ క్వాలిటీ ఎస్యూరెన్స్ అండ్ టెక్నలాజికల్ డెవలప్‌మెంట్ (క్యూ.ఎ.టి.డి) విభాగం జనరల్ మేనేజర్ రుచిరా గుప్తా అన్నారు. జనరల్ ఫోర్‌మన్ పేర్ల సత్యారావు క్యూఏటీడీ విభాగంలో 36 ఏళ్లు విధులు నిర్వహించి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా విభాగం ఉద్యోగులు గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ హుద్‌హుద్ సమయంలో సత్యారావు తన ప్రతిభతో విభాగానికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అధికారులు పి.అప్పారావు నాయుడు, పద్మప్రియ, శాంతమ్మ, మురళీధర్, ఆశ, యామినీ, శార్దక్, ముజేందర్, గీతాశ్రీ, కార్మిక నాయకులు నరేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, ఈటి శ్రీనివాసరావు, గంగవరం గోపి, కొవిరి కోదండ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర తులసీదళార్చన



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. 26 మంది ఉభయదాతలు అమ్మ వారికి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. భక్తులు రూ.1,000 రుసుం చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చు.

శ్రావణ మాస కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మీ పూజలు గురువారం నాటికి 8వ రోజుకు చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో 16 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణమాసం నెల రోజులు నిర్వహించే పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని, పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు.

నేడు సింహగిరిపై లక్ష కుంకుమార్చన

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు సింహవల్లీ తాయారు అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి సహస్ర నామార్చన నిర్వహించనున్నారు. సింహవల్లీ తాయారు అమ్మవారి ప్రతినిధులైన చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారికి తిరువీధి జరపనున్నారు. దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

యువకుడి ఆత్మహత్య

మద్రిపాలెం: ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాడేరుకు చెందిన కృష్ణారావు(25) అనే యువకుడు కంచరపాలెం అరుంధతినగర్‌లోని తన బంధువుల ఇంట్లో నివసిస్తున్నాడు. నగరంలోని సిరిపురంలో గల ఓ వస్త్రాల దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి తల్లిదండ్రులు పాడేరులో నివసిస్తున్నారు. మృతుడి బంధువు కె.భాగ్యవతి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం జరుగుతుందని పోలీసులు తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిస్థాయి దర్యాప్తులో తెలియాల్సి ఉందని చెప్పారు.

జాబ్‌మేళాలో 250 మందికి ఉపాధి



జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

అగనంపూడి: అగనంపూడి సమీపంలోని గొన్నా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 250 మంది ఎంపికైనట్టు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ గొన్నా హేమచంద్ నాయుడు తెలిపారు. గొన్నా విద్యా సంస్థల వ్యవస్థాపకుడు జీబీ నాయుడు జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో 20 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా హేమచంద్ నాయుడు మాట్లాడుతూ నిరుపేదలకు, స్థానికులకు ఉన్నత విద్యను అందుబాటులో ఉండాలనే సంకల్పంతో తమ తండ్రిగారైన జి.బి.నాయుడు గొన్నా విద్యాసంస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. ఎంపిక ప్రక్రియలో 12 వందల మంది నిరుద్యోగులు హాజరు కాగా 250 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, ప్లేస్‌మెంట్ అధికారి ఓం నమశ్శివాయ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరిపురంలో ఆర్టీసీ పార్సిల్ కౌంటర్



పార్శిల్ కౌంటర్ వద్ద ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

బీచ్ రోడ్డు: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నట్టు సంస్థ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. వాల్తేరు డిపో ఆధ్వర్యంలో సిరిపురంలోని 900కే బస్టాప్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ పార్సిల్ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ, మద్దిలపాలెం కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో పార్సిల్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతో పార్సిల్స్‌ను ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మారథాన్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ



వంశీకృష్ణను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: దేశ స్వాతంత్ర్యానికి 76 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ నెల 14న వైజాగ్ రన్నింగ్ అసోసియేషన్ నిర్వహించిన 76 కిలోమీటర్ల ఆల్ట్రా మారథాన్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థి కె.వంశీకృష్ణ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా గురువారం వంశీకృష్ణను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. రేసులో నలుగురు క్రీడాకారులు పాల్గొనగా బుల్లయ్య కళాశాలలో బీఎస్సీ సెకండియర్ చదువుతున్న వంశీకృష్ణ పాల్గొన్నాడు. 14వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నోవాటెల్ వద్ద మారథాన్ ప్రారంభించి 15వ తేదీ ఉదయం 5 గంటలకు ముగించారు. వైజాగ్ రన్నింగ్ అసోసియేషన్ వంశీకృష్ణకు జ్ఞాపిక బహూకరించింది. ఈ సందర్భంగా వంశీకృష్ణకు కళాశాల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

వ్యక్తి అరెస్ట్ : గంజాయి స్వాధీనం

కూర్మన్నపాలెం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ముందస్తు సమాచారంతో ఓ వ్యక్తిని దువ్వాడ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. అగనంపూడి దరి బొర్రమాంబ కాలనీకి చెందిన ముప్పల మహేశ్వరరావు అగనంపూడి, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రాంతాల్లో పేకాట నిర్వహిస్తున్నాడని, అక్రమంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో దువ్వాడ పోలీసులు బుధవారం రాత్రి మంగళపాలెం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో అతని వద్ద ఉన్న 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహేశ్వరరావును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250





సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com